## క్లుప్తంగా

### బాధిత కుటుంబాలకు పరామర్శ

**తొండంగి:** శృంగవృక్షం గ్రామదేవత నూకాలమ్మ జాతర సందర్భంగా జరిగిన ఘర్షణలో మృతి చెందిన దళిత యువకుడు నడిపల్లి రాము కుటుంబ సభ్యులతో పాటు గాయపడిన వారి కుటుంబాలను సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.మూర్తి గురువారం పరామర్శించారు. తొండంగిలో మృతుడి స్వగృహానికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. శృంగవృక్షంలో గాయపడిన బాధితులను కూడా పరామర్శించారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, రాష్ట్రకమిటీ సభ్యుడు కె.జనార్దన్, మానుకొండ లచ్చబాబు, వాడబోయిన శివ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన



గోకవరంలో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ నాయకులు

**గోకవరం:** స్థానిక బంగాళాపేటలో డ్రైనేజీ నిర్మాణానికి గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు ఎంపీపీ నిధులతో ఈ డ్రైన్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి మురుగు సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, తోలేటి రాంప్రసాద్, వార్డు సభ్యురాలు మచ్చా జయమ్మ, బిజ్జి రాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



తుని రైల్వేపోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న రామారావు

**తుని:** ప్రస్తుత వేసవిలో రైళ్లలో ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు జీఆర్పీ కాకినాడ లైన్స్ రైల్వే ఇన్‌స్పెక్టర్ డి.రామారావు అన్నారు. తుని రైల్వేస్టేషన్‌లో గురువారం జీఆర్పీ పోలీసులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వేసవిలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భద్రతతో పాటు దొంగతనాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

### క్రైస్తవుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

**ప్రత్తిపాడు రూరల్:** క్రైస్తవుల సంక్షేమానికి అన్నివిధాలా పాటుపడతానని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ధర్మవరం బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చ్‌లో గురువారం జరిగిన మండల పాస్టర్స్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు తమ పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు పాస్టర్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను పాస్టర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, ఆర్.షాలేం, కృపావరం, మాసా ఇమ్మానుయేలు, జి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**తొండంగి:** జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి శివారు అన్నవరం నమూనా ఆలయం వద్ద వద్ద వ్యాన్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందినట్టు తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే..గొల్లప్రోలుకు చెందిన జల్లిగంపల వెంకటరావు (42) ఈ నెల 29న వ్యాపార పని నిమిత్తం తుని వెళ్లాడు. పని ముగించుకుని తుని నుంచి గొల్లప్రోలు తిరిగి బైకుపై వెళ్తుండగా అన్నవరం నమూనా టెంపుల్ సెంటర్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరావును కుటుంబ సభ్యులు, స్థానికులు 108 అంబులెన్స్‌పై తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వెంకటరావు సోదరుడు శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికుమార్ వివరించారు.



కొత్త సూరవరంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు



తునిలో సీతారాములకు పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, బాలు దంపతులు



ఏలేశ్వరంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి దంపతులు



గోకవరం దాసరి వారి రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, రమేష్ దంపతులు

# చూసిన కనులకు వైభోగం

శ్రీరామనవమి వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో గురువారం వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. గ్రామాల్లో రాములోరి ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- గ్రామాల్లో అన్నదానాలు



శంఖవరం సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



రత్నగిరిపై స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

**ఏలేశ్వరం:** స్థానిక దిబ్బలపాలెం రామాలయం వద్ద మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, అశాలత దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. దిబ్బలపాలెంలోని లక్కవరం కాలనీ రామాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ సుంకర హైమావతి, రాంబాబు దంపతులు పీటలపై కూర్చొని సీతారాముల కల్యాణం జరిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బొదిరెడ్డి గోపి, వాగుబలరామ్ పాల్గొన్నారు.

**తుని:** పట్టణంలో రామాలయాలకు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. సీతారాముల కల్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, బాలు దంపతులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులకు పానకం పంపిణీ చేశారు.

**శంఖవరం:** స్థానిక రామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు కల్యాణం తిలకించారు.

**తొండంగి:** మండలంలోని దానవాయిపేట, తొండంగి, గోపాలపట్నం, బెండపూడి, రావికంపాడు, ఏవీ నగరం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, పైడికొండ తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

**గోకవరం:** స్థానిక దాసరివారి రామాలయంలో జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, ఎంపీపీ దంపతులు సుంకర శ్రీవల్లి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు:** మండలంలోని ప్రత్తిపాడు, టి.రాయవరం, ఏలూరు, చినశంకర్లపూడి, పెద శంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల్లో సీతారాముల పరిణయ వేడుక కన్నులపండువగా జరిగింది. ప్రత్తిపాడు బజారువీధి రామాలయంలో తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

**తుని రూరల్:** మండలంలోని ఎస్.అన్నవరం, కొత్త సూరవరం, ఎన్.సూరవరం, డి.పోలవరం, తేటగుంట, వి.కొత్తూరు, హంసవరం, వల్లూరు, చామవరం, చేపూరు, అటికెవానిపాలెం, దొండవాక, రాపాక, కొలిమేరు, టి.తిమ్మాపురం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణం జరిపించారు.

**కోటనందూరు:** మండలంలోని పాతకొట్టాంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు కల్యాణ క్రతువును తిలకించి తరించారు.



కోటనందూరు మండలం పాతకొట్టాంలో సీతారాముల కల్యాణం



ప్రత్తిపాడులో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి

**గండేపల్లి:** మండల వ్యాప్తంగా సీతారాముల పరిణయ వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామాల్లోని రామాలయాలకు భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

**అన్నసమారాధనలు**

**కిర్లంపూడి:** శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామాల్లో గురువారం అన్నసమారాధనలు నిర్వహించారు. స్థానిక కొండయ్యపేట రామాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**రౌతులపూడి:** శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని ఎ.మల్లవరం, బలరామపురం, రౌతులపూడి, ములగపూడి, లచ్చిరెడ్డిపాలెం, పారుపాక, శృంగవరం, దిగువశివాడ తదితర గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

### ఆంధ్రా భద్రాద్రిగా శ్రీరామక్షేత్రం

**ప్రత్తిపాడు:** స్థానిక నరేంద్రగిరిపై నిర్మిస్తున్న శ్రీరామక్షేత్రం అనతికాలంలోనే ఆంధ్రా భద్రాద్రిగా రూపుదిద్దుకుంటుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. ఇటీవల శ్రీరామక్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు గళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో 20 మంది సభ్యులు గొంచాల నుంచి కాశీ, అయోధ్యకు 1,800 కిలో మీటర్ల మహాపాదయాత్ర చేపట్టారు. కాగా గురువారం రాత్రి శ్రీరామక్షేత్రంలో మహాపాదయాత్ర బృందాన్ని ఎమ్మెల్యే మెమెంటోలు, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్రి రమణ, శ్రీరామక్షేత్రం అధ్యక్షుడు రెడ్నం రాజా, దొడ్డిపట్ల సోమన్నదొర, సొసైటీ మాజీ అధ్యక్షుడు జువ్వల చినబాబు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర



ఏలేశ్వరంలో శ్రీరాముని శోభాయాత్ర

**ఏలేశ్వరం:** శ్రీరామ నవమిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, వివేకానంద సేవాసమితి, వీరమణికంఠ భక్తసమాజం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక లింగంపర్తి రోడ్డులోని సత్తెమ్మతల్లి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. పట్టణంలోని మెయిన్ రోడ్డు, తిరుమాలి మీదుగా యర్రవరం వరకూ సాగింది. సుమారు వంద మోటారు బైక్‌లతో భక్తులు, మహిళలు యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అలమండ దుర్గావెంకటప్రసాద్, అడపా శివప్రసాద్, పాటోలు దుర్గాదేవి, మైరాల నాగేశ్వరరావు, కటకం కిరిటీ, గట్టెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా శోభాయాత్ర**

**ప్రత్తిపాడు రూరల్:** శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండలంలోని పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో శోభా యాత్ర చేపట్టారు. రెండు గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, యువకులు జైశ్రీరామ్ నినాదాలతో యాత్ర నిర్వహించారు. గ్రామస్తులు దారి పొడవునా ఈ శోభా యాత్రను ఆసక్తిగా తిలకించారు.

**కిర్లంపూడి:** శ్రీరామ నవమిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవరం వేంకటేశ్వరస్వామి సన్నిధి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. చిల్లంగిలో స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు.

### నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

**ప్రత్తిపాడు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను పంపిణీ చేయనున్నట్టు వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం వై.వెంకట్ గురువారం తెలిపారు. మండలంలోని 1,373 పొదుపు సంఘాల్లోని 13,591 మంది సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10.54 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ లబ్ధిదారులకు అందజేస్తారని చెప్పారు. మండలంలోని మహిళా సంఘాల సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

**జగ్గంపేట:** స్థానిక గోకవరం రోడ్డులోని సాయిబాలాజీ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు లబ్ధిదారులకు మూడో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ బి.హరికృష్ణ తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**కొత్తపల్లి:** స్థానిక తీపిగుర్తులు స్టూడియోలో గురువారం సీఎస్ఎన్ క్రియేషన్ బ్యానర్‌తో నిర్మించిన 'హలో మాస్టార్' షార్ట్ ఫిల్మ్ పోస్టర్‌ను మూవీ ఆర్ట్ అసోసియేషన్ సభ్యుడు పేరూరి కల్కి, జిల్లా తెలికుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పేరూరి రమణ ఆవిష్కరించారు. ఈ షార్ట్ ఫిలిమ్‌లో హీరోగా ప్రకాష్, హీరోయిన్‌గా అనూష నటించగా దర్శకుడిగా సూరాడ ప్రతాప్, ఎడిటర్‌గా చిత్రాడ జగ్గారావు పనిచేస్తున్నట్లు తెలిపారు. కాలానుగుణంగా సాగే ఒక ప్రేమ కథా చిత్రమని, త్వరలో ఆదిత్య మ్యూజికల్ చానల్ ద్వారా విడుదల చేయనున్నట్లు ప్రతాప్ తెలిపారు.

## తంటికొండ దేవస్థానం చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని ఈఓకు అందజేస్తున్న రాంబాబు

**గోకవరం:** మండలంలోని తంటికొండ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పదవికి బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి) రాజీనామా చేశారు. ఇటీవల ఆలయంలో పలువురు సిబ్బంది హుండీల్లో భక్తులు వేసిన కానుకల విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వీటిపై విచారణ నిర్వహించే వరకూ హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించకూడదని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును సైతం అడ్డుకున్నారు. దీనిపై ఎటువంటి విచారణ నిర్వహించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఈఓ ఆర్‌వీ చందనకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానం చైర్మన్ హోదాలో ఆయన సిబ్బంది విధులకు తరచూ ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఆయన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. ఆయన రాజీనామా పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

## ఆక్రమణల తొలగింపుతో అవస్థలకు చెక్



తుని పట్టణం సూరవరం రోడ్డు కాలువలో వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

**తుని:** సువిశాలమైన రహదారిలో సగం మేర ఆక్రమణలకు గురి కావడంతో ప్రజలు పడిన అవస్థలు మాటల్లో చెప్పలేం. ఎంతో ప్రాధాన్యం కలిగిన సూరవరం రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజును ఆదేశించారు. ఈ మేరకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రంగంలో దిగి రెండు రోజుల పాటు శ్రమించి పూర్తి స్థాయిలో ఆక్రమణలను తొలగించారు. దీంతో రోడ్డు అద్దంలా దర్శనమిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఆక్రమణల వలన కాలువలో పూడిక తీయలేదు. ఎట్టకేలకు కాలవల్లో ఉన్న వ్యర్థాలను శానిటేషన్ అధికారులు గురువారం సిబ్బందితో కలిసి తొలగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆదేశాలతో డ్రైన్లలను శుభ్రం చేయుటంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ప్రజారోగ్యశాఖాధికారి శేఖర్, శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



అల్లిపూడి బీసీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన మోటారు

**కోటనందూరు:** మండలంలోని అల్లిపూడిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామని పంచాయతీ కార్యదర్శి అగ్రహారపు వెంకటరమణ తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయ చినబాబు ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీల్లో కొత్తగా పంపింగ్ చేసే మూడు మోటార్లు, ఐదు చేతి పంపులను ఏర్పాటు చేశామన్నారు. శివారు ప్రాంతాలకు సైతం మంచినీటిని అందించేందుకు పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. గతంలో పంపింగ్ చేసే బోరుబావుల లోతు తక్కువగా ఉండడంతో డిమాండ్‌కు తగినంత నీరు సరఫరా చేయలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బోరుబావుల లోతును పెంచడంతో పాటు కొత్తమోటార్లను ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో చేతిపంపులను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. అధికారుల చర్యల పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సీతారాములకు అరుంధతీ నక్షత్ర దర్శనం



నవదంపతులు సీతారాములకు అరుంధతీ నక్షత్రం చూపిస్తున్న పండితులు

**అన్నవరం:** శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నవదంపతులు సీతారాములకు పండితులు గురువారం రాత్రి అరుంధతి నక్షత్ర దర్శనం చేయించారు. రాత్రి 7 గంటలకు వేదమంత్రాల నడుమ సీతారాములను ఊరేగింపుగా రామాలయం వెలుపలకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు చేసి ఆకాశంలోని అరుంధతి నక్షత్రం వైపు చూపించారు. అనంతరం స్వామివార్లను రామాలయానికి తీసుకువెళ్లారు.

**ఘనంగా స్వామివార్ల గ్రామోత్సవం**

**అన్నవరం:** శ్రీరామనవమి సందర్భంగా గురువారం అన్నవరం వీధుల్లో స్వామివార్లను ఘనంగా ఊరేగించారు. వధూవరులు సీతారాములకు వెండి ఆంజనేయ వాహనం మీద, పెళ్లి పెద్దలు సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లకు వెండి పల్లకీ మీద గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్ర శేఖర్ అజాద్, తదితరులు పాల్గొన్నారు.

## తంటికొండ వెంకన్నకు రూ.8.34 లక్షల ఆదాయం



తంటికొండ వెంకన్న హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

**గోకవరం:** మండలంలోని తంటికొండ వేంటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. ఆలయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని, దీనిపై విచారణ నిర్వహించిన తరువాతే హుండీ ఆదాయం లెక్కించాలని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును దేవస్థానం చైర్మన్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో గురువారం దేవదాయశాఖ తనిఖీ అధికారుల పర్యవేక్షణలో భక్తులు, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. మొత్తం ఆరు నెలల కాలానికి హుండీల ద్వారా రూ.8,03,313 ఆదాయం వచ్చింది. గతంలో ఆలయ ప్రాంగణంలో శీలు వేసిన పరకామణి హుండీ లెక్కించగా రూ.31,362 ఆదాయం వచ్చింది. మొత్తం హుండీల ద్వారా రూ.8,34,675 ఆదాయం వచ్చిందని, గతంతో పోల్చితే ఆదాయం పెరిగిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు నాగసురేష్, తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ

**తొండంగి:** శృంగవృక్షం గ్రామదేవత నూకాలమ్మ జాతరలో జరిగిన ఘర్షణలో తొండంగికి చెందిన దళిత యువకుడు నడిపల్లి రాము మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృతుడి కుటుంబ సభ్యులను శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడు గురువారం పరామర్శించారు. తొండంగిలో రాము స్వగృహానికి వెళ్లి తండ్రి నాగేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి జరిగిన సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు.

## చురుగ్గా డ్రైన్ల నిర్మాణ పనులు

**ఏలేశ్వరం:** పట్టణంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా చేపట్టిన డ్రైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఓ పక్క ఆక్రమణలు తొలగిస్తుండగా మరోపక్క డ్రైన్లు నిర్మిస్తున్నారు. పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకరిస్తామని వ్యాపారులు తెలిపారు. ఈ మేరకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్యకు వ్యాపారులు వినతి పత్రం అందజేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. పట్టణంలోని యర్రవరం రోడ్డు, లింగంపర్తి రోడ్డు, నర్సీపట్నం రోడ్డు, పాతఅడ్డతీగల రోడ్లకు ఇరువైపులా డ్రైన్లు నిర్మించేందుకు గాను ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణల తొలగింపు పనులకు తాము ఆటంకం కలిగించబోమని వ్యాపారులు తెలిపారు. స్వచ్ఛందంగా తామే ఆక్రమణలు తొలగించుకుంటామని చెప్పి డ్రైన్ల నిమిత్తం అధికారులు వేసిన మార్కింగ్ వరకు దుకాణాలు తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత చలమయ్య మాట్లాడుతూ వ్యాపారులతో తమకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. పట్టణాభివృద్ధి కోసమే ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైన్లు లేకపోవడంతో వ్యాపారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రైన్ల నిర్మాణంతో వ్యాపారులు, ప్రజలకు అవస్థలు తప్పుతాయన్నారు. అక్రమణలపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.



ఏలేశ్వరంలో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తున్న వ్యాపారులు